క్లుప్తంగా

కామేశ్వరీదేవికి పట్టుచీరలు



పట్టుచీరలు అందిస్తున్న రామ్మోహన్‌రావు దంపతులు

మహానంది: హైదరాబాద్ నగరానికి చెందిన వారణాసి రామ్మోహన్‌రావు దంపతులకు మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి ఇంటి దేవత. దీంతో వారు శుక్రవారం ఆలయానికి చేరుకుని 13 పట్టుచీరలను వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డిలకు అందించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకర శర్మ, ముఖ్య అర్చకులు ప్రకాశం శర్మ, పండితులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏఓ

కొత్తపల్లి: రైతులకు యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తామని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం, గువ్వలకుంట్ల గ్రామాల్లో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి ఇప్పటిదాకా 143.64 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రైతుల సహకారంతో, మండల టీం పర్యవేక్షణలో, పోలీసులు, అధికారుల సాయంతో యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో కొలువైన గంధం స్వామి పీరు గ్రామోత్సవం ఘనంగా సాగింది. రాత్రి గ్రామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం గ్రామోత్సవం వెంట నిర్వహించిన కోలాటం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



పెండింగ్ బిల్లులు చెల్లించాలని నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బండి ఆత్మకూరు: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యాలయంలో ఎంపీడీఓ, ఏపీఎంలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే నెల నుంచి ఉపాధి కూలీల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని అధికారులను కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రత్నమయ్య, డేవిడ్, రాజు, రామచంద్రుడు, కుళాయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

అలరించిన గాత్ర కచేరి



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన బులుసు సూర్యనారాయణ, బృందం వారిచే నిర్వహించిన గాత్రకచేరి పలువురు భక్తులను అలరించింది. కార్యక్రమంలో సిద్ధివినాయకం, శంభోశంకరా, భో శంభో, నాదతాండవం శంకరం, దేవ దేవం భజే, కాలభైరవాష్టకం, నమోస్తూ వాణి, బ్రహ్మమురారి, నమశ్శివాయ నటేశ్వరాయ తదితర గీతాలను, అష్టకాలను బులుసు సూర్యనారాయణ తదితరులు ఆలపించారు.



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం



మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపునీరు

వదలని వర్షం!

- ఆత్మకూరు మండలంలో 94.8 మి.మీ. వర్షపాతం నమోదు

ఆత్మకూరు: రెండు రోజులుగా వర్షం వదలడం లేదు. శుక్రవారం వేకువజామున రికార్డుస్థాయిలో వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు 98.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా కురిసిన వర్షానికి నదులు, వాగులు, వంకలు నిండుకుండలా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు మొక్కజొన్న, వరి, కంది పంటలు నీట మునిగాయి. పైర్లు ఏపుగా పెరుగుతున్న సమయంలో వర్షాలు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



తమ్మడపల్లె సమీపంలో మొక్కజొన్న తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు

దిగుబడులు కాపాడుకునేందుకు రైతులు తంటాలు

మహానంది: వర్షం అంటేనే రైతుల్లో భయం నెలకొంది. తుఫాను ప్రభావంతో రోజూ విరామం లేకుండా వర్షం కురుస్తుంది. ఎప్పుడు ఏ సమయంలో వస్తుందో చెప్పలేని పరిస్థితి కనిపిస్తుంది. ఈ మేరకు మొక్కజొన్న సాగు చేసిన రైతులు దిగుబడులను కాపాడుకునేందుకు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అవకాశం ఉన్న వారు ఇళ్ల వద్ద, మరికొందరు పొలాల వద్ద, రోడ్ల వెంట మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. అయితే అక్కడే ఉంటూ వర్షం వచ్చే అవకాశం కనిపిస్తే చాలు ప్లాస్టిక్ పట్టలు కప్పుకుంటూ కాపాడుకుంటున్నారు. తమ్మడపల్లె వద్ద ఎక్కువగా ధాన్యం నిల్వలు ఉన్నాయి. సరైన ధర కోసం ఎదురుచూస్తున్నామని రైతులు పేర్కొన్నారు.



కూలిన మట్టి మిద్దెను చూపుతున్న నాగమణి

కూలిన మట్టిమిద్దెలు

కొత్తపల్లి: మండలంలో గురువారం నుంచి శుక్రవారం వరకు 18.8 మి.మీల వర్షం కురిసింది. వర్షాల వల్ల మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందే సమయంలో వర్షం మొక్కజొన్న కంకి దశను నాశనం చేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గువ్వలకుంట్ల గ్రామంలో వర్షానికి పోత నాగమణికి చెందిన మట్టిమిద్దె, గద్వాల సుబ్బమ్మకు చెందిన మట్టిమిద్దెలు కూలిపోయాయి. వంట సామగ్రి, బియ్యం బస్తాలు తడిసిపోయాయిన బాధితులు వాపోయారు.



వర్షానికి కూలిన సుబ్బమ్మ మట్టిమిద్దె

ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలి

ఆత్మకూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం అబ్దుల్‌సలాం, ఏడీఏ హేమలత, వ్యవసాయ అధికారి పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై వీఏఏలకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయనిక, క్రిమిసంహారక ఎరువులను అధిక మోతాదులో వాడడం వల్ల నేల సారం క్షీణించి పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. ప్రతిరైతు భూసార పరీక్షలు చేయించుకుని, ఫలితాలకు అనుగుణంగా మందులు, ఎరువులు వాడి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరేంద్రగౌడ్, నాగరాజు, మహబూబ్‌బాషా, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీపీఎం అబ్దుల్ సలాం

- నందికొట్కూరు: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి సూచించారు. శుక్రవారం ఆత్మ భవనంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ డివిజన్ అధికారి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

పాములపాడు: ఈనెల 15 నుంచి జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద పశువులకు గాలికుంటు టీకాలు వేయనున్నట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి భాస్కర్ మాట్లాడుతూ మండలంలో 8,071 పశు సంపద ఉందన్నారు. అందులో ఆవులు, ఎద్దులు 3,248 ఉన్నాయన్నారు. ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు టీకాలు వేయనున్నామని, గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహానంది: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ రాత్రి 12 నుంచి ఉదయం 9 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

శ్రీశైలంప్రాజెక్ట్: అడవులను కాపాడుకోవడం అందరి బాధ్యత అని శ్రీశైలం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం.పరమేశులు అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలం రేంజ్ కోర్ ఏరియాలో ఉన్న కారణంగా అటవీ ఆంక్షలు తప్పని సరి అన్నారు. అటవీ చట్టాలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవన్నారు. విధి నిర్వహణలో రాజకీయ ఒత్తిళ్లు సహజమన్నారు. అయితే చట్టాలను ఉల్లంఘించి ఒత్తిళ్లకు లొంగే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

పనిభారం తగ్గించాలి

ఆత్మకూరు: తమపై పనిభారం తగ్గించాలని పలువురు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఎంపీడీఓ ఉమ్మర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

కేజీబీవీ తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి

ఆత్మకూరు: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి శుక్రవారం తనిఖీ చేశారు. భోజనం, నిత్యావసర సరుకులు నాణ్యతగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం బాలికల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ మేరి మార్గరేట్ ఉన్నారు.

- బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పలు పాఠశాలలను, అంగన్‌వాడీ సెంటర్లను శుక్రవారం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమల దేవి తనిఖీ చేశారు. ఏ కోడూరు ఎంపీపీ స్పెషల్ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ 1, 2లను, బండి ఆత్మకూరు జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలని హెచ్‌ఎం నూర్జహాన్‌కు సూచించారు. ఆమె వెంట జిల్లా ఉపవిద్యాధికారులు శంకర్ ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరి, మండల విద్యాశాఖ అధికారులు యశోద, మోహన్ రెడ్డి, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.
- వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఏపీ ఫుడ్ కార్పొరేషన్ సభ్యురాలు గంజిమల దేవి పరిశీలించారు. అనంతరం అబ్బిరాజుకుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల కోసం తయారు చేసిన ఆహారాన్ని రుచి చూశారు. గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న బాలసంజీవని కిట్, పాలు, గుడ్లు, బాలామృతం కిట్లను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం రుచిగా తయారు చేసిన ఆయా తులసీబాయిని సన్మానించారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి చేద్దాం





సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, బండి ఆత్మకూరులో..

ఆత్మకూరు: కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు రాజశేఖర్, సుధాకర్ కోరారు. ధనుంజయ మీటింగ్ హాల్‌లో శుక్రవారం సీతారాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పార్టీ నాయకులు రజాక్, నాగేశ్వరరావు, సుబ్బయ్య, వీరన్న, అంబయ్య, కృష్ణమూర్తి, లక్ష్మన్న, యేసన్న, మల్లయ్య, మాబాషా, శివుడు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

బండి ఆత్మకూరు: సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డేవిడ్, రత్నమయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

- జూపాడుబంగ్లా: సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ కర్ణ, సర్పంచ్ మొట్టె బాలయ్య తదితరులు శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం



బదిలీ అయిన సచివాలయ సిబ్బందితో సర్పంచ్ మధు

బండి ఆత్మకూరు: ఇటీవల బదిలీ అయిన గ్రామ సచివాలయ సిబ్బందిని చిన్న దేవలాపురం గ్రామ సర్పంచ్ ఆవులపాటి మధుసూదన్ చౌదరి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకొని ప్రజలకు మంచి సేవలు అందించారన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందికి శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కంచర్ల ఈశ్వరయ్య, కంచర్ల గోవిందులు, జి.లింగేశ్వరరావు, జి.వెంకటరావు, ఎం.వి. విజయమోహన్, ఎం.రాము, కంచర్ల చిన్న పుల్లయ్య పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీడీఓ అన్వరాబేగం

జూపాడుబంగ్లా: ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆత్మకూరు డీడీఓ అన్వరాబేగం సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి తిప్పన్నలతో కలిసి శుక్రవారం మండ్లెం గ్రామంలో పర్యటించి పరిశుభ్రతపై గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ ఉంచి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు.

ప్రాపర్టీ టాక్స్‌ను గుర్తించి పన్నులు వేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఎంఏ నాగరాజు

నందికొట్కూరు: ప్రాపర్టీ టాక్స్‌ను గుర్తించి పన్నులు వేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు సూచించారు. శుక్రవారం పట్టణంలోని సచివాలయాలను, మున్సిపాలిటి పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. జైకిసాన్ పార్కులో సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశమై పలు సూచనలు చేశారు. సమావేశంలో మున్సిపల్ డీఈ నాసీర్, మేనేజర్ లత, టీపీఓ రంగస్వామి, ఏఈ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల వెల్లువ



సమస్యల పై ఎమ్మెల్యేకు అర్జీలు ఇస్తున్న ప్రజలు

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. మండల అధికారులతో ఆయా శాఖలకు సంబంధించిన అంశాల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. రెండవ విడత సీసీ రహదారుల నిర్మాణకు గ్రామాలు, మండలం నుంచి తీర్మానాలు ఎందుకు పంపలేదంటూ జేఈ రాఘవేంద్రప్రసాద్, రుద్రవరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టకపోవడం, పాములపాడు ఏఎస్‌ఆర్ జెడ్పీహెచ్ స్కూల్ అని దాతల పేరు ఆనలైన్‌లో నమోదు చేయకపోవడంపై ఎంఈఓ బాలాజీనాయక్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తుమ్మలూరు, మిట్టకందాల, మద్దూరు గ్రామాలకు చెందిన ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ రిలీజ్ కాగా వారి కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్ నాగలక్ష్మి, ఎంఈఓ బాలాజీనాయక్, ఏఓ మహేశ్వరరెడ్డి, ఏఈలు రాఘవేంద్రప్రసాద్, శ్రీనివాసనాయక్, డిప్యూటీ ఎంపీడీఓ సులోచన, ఆర్‌ఐ ఖాజాబీ, హెచ్ డబ్ల్యూ అనిత, సర్పంచులు మల్లీశ్వరెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- వర్షాలు కురిసినప్పుడల్లా భవనాశి నది వెంబడి పంట పొలాలు నీటమునిగి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని, విస్తరణ చేపట్టి, ఎస్‌ఆర్‌ఎంసీకి అనుసంధానంగా ఇన్‌లెట్‌చానల్ నిర్మాణం చేపట్టాలని, అలాగే వంతెన నిర్మాణం చేపట్టాలని ఇస్కాల రైతులు అర్జీ ఇచ్చారు.
- చెలిమిల్ల గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని, వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని, భవనాశి సుద్దవాగు, ఎద్దులంక వాగుల వల్ల పంట పొలాలు నాశనం అయ్యాయని, నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరారు.
- పాములపాడులో శివాలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానికులు అర్జీ ఇచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీవీ సుబ్బారెడ్డి తదితరులు

బండి ఆత్మకూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు పీవీ సుబ్బారెడ్డి తదితరులు శుక్రవారం తహసీల్దార్ పద్మావతిని కలిసి వినతిపత్రం అంజేశారు.

మహానందీశుడికి పల్లకీసేవ

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవాన్ని నిర్వహించారు.

నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలి

పాములపాడు: వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఇస్కాల గ్రామంలో దెబ్బతిన్న పొలాలకు సంబంధించి వీఏఏ గాయత్రీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీఏఏ గ్రామంలో సర్వే నెంబరు 1నుంచి 350 వరకు మాత్రమే పంట నష్ట పరిహారానికి జాబితా సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలున్నాయని, ఇందుకోసం తీర్మానం చేసేందుకే గ్రామ సభ ఏర్పాటు చేశామని, తీర్మాన పత్రంలో రైతులందరూ సంతకాలు చేయాలని కోరగా రైతులు తిరస్కరించారు. గ్రామంలో నష్టపోయిన ప్రతి ఎకరాను పరిగనలోకి తీసుకోవాలని, ప్రతి రైతుకు న్యాయం జరగాలని అలాగైతేనే తీర్మాన పత్రంలో సంతకాలు చేస్తామని మూకుమ్మడిగా రైతులు భీష్మించారు. గ్రామంలో సుమారు 1,800 ఎకరాల్లో నష్టం జరిగిందని, ఇందుకు వర్షాలు కురవడం, వరదస్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంలో అధికారుల నిర్లక్ష్యానికి తామంతా బలయ్యామని వాపోయారు. పంట సాగుకు అయ్యే పెట్టుబడి పూర్తిగా కాగా మరో 20 రోజుల్లో దిగుబడులు తీసుకునే తరుణంలో తీవ్రంగా నష్టపోయామని పేర్కొంటూ గ్రామ సభను వ్యతిరేకిస్తూ రైతులు వెనుదిరిగారు. గ్రామ సభలో బాధిత రైతులు శేషులు, శేఖర్, కేశాలు, లింగమూర్తి, శ్రీనువాసులు, ప్రసాద్, మహేష్, శివ పాల్గొన్నారు.



తూడిచెర్ల రైతుసేవా కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం బారులు

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల, తరిగోపుల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు ఒక్కోదానికి 24టన్నుల చొప్పున యూరియా మంజూరైంది. అలాగే తంగడంచ ఆర్‌ఎస్‌కే కు 6టన్నుల యూరియా సరఫరా చేశారు. విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల్లోని రైతులు శుక్రవారం రైతుసేవా కేంద్రాల వద్ద ఉదయం నుంచే బారులు తీరారు. గంటల తరబడి వేచి ఉన్నా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామంలో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో శుక్రవారం తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కుంకుమార్చన, గోపూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తిరాజదాస్, మల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం



శ్రీశైలంలో ప్రచారం నిర్వహిస్తున్న శివ తిప్పర్తి

శ్రీశైలంటెంపుల్: భద్రాద్రి జిల్లా జూలూరుపాడు గ్రామ పాఠశాల రికార్డు అసిస్టెంట్ శివ తిప్పర్తి ప్లాస్టిక్ నిషేధంపై అవగాన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ పెను భూతం, ప్లాస్టిక్‌ను నిషేధిస్తేనే ఆరోగ్యం అక్షరాలున్న టోపీ, దుస్తులు ధరించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహిస్తూ శుక్రవారం శ్రీశైలం చేరుకున్నారు.

సారా విక్రయిస్తే కేసులు నమోదు



నాటుసారా చూపుతున్న సీఐ రామాంజనేయులు నాయక్, ఎస్‌ఐలు, పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. శుక్రవారం స్వాధీనం చేసుకున్న నాటు సారా వివరాలను ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. నాటుసారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సీఎస్‌ఐ పాలెంలో సోదాలు నిర్వహించామన్నారు. బొల్లవరం వెంకటరమణను అరెస్ట్ చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు జప్రూల్లా, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ కుమారి, పోలీసులు సుధీర్‌కుమార్, మధుప్రసాద్, శ్వేతారాణి తదితరులు ఉన్నారు.